# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటనలో మృతి చెందిన వారికి 10 లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.
- ❖ ఖైదీలలో మానసిక పరివర్తన తెచ్చేందుకు ఓపెన్ ఎయిర్ జైళ్లు ఏర్పాటు చేస్తున్నామని హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.
- ❖ జాబ్ క్యాలెండర్‌ను ఉగాది పండుగ నాటికి విడుదల చేస్తామని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు.
- ❖ ఆప్కో, చేనేత సంఘాలు విక్రయించిన వస్త్రాలకు జీఎస్టీ మినహాయింపు ఇవ్వాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు.

==========================

రాజమహేంద్రవరంలో చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్‌లో కల్తీ పాల కారణంగా ఈనెల 15వ తేదీ నుండి అస్వస్థతకు గురవుతూ వస్తున్న వారిలో ఇప్పటి వరకూ నలుగురు మృతి చెందారు. ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం 10 లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు శాసనసభలో ప్రకటించారు. ఈ ఘటన పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. లాలా చెరువు ప్రాంతంలో నలుగురు చనిపోయారని.. 8 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. కల్తీ పాల వల్లే అస్వస్థతకు గురైనట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయిందని ముఖ్యమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

సంక్షేమ బడ్జెట్ కేటాయింపులపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ... సామాజిక సమానత్వం అనే లక్ష్యం కోసం ఎన్డీయే కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పీ-4 కార్యక్రమం ద్వారా ఆర్థిక అసమానతలు తొలగించటానికి చర్యలు తీసుకుంటున్నట్లు చంద్రబాబు నాయుడు వివరించారు.

==========================

ఖైదీలలో మానసిక పరివర్తన తెచ్చేలా ఓపెన్ ఎయిర్ జైళ్లు ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. శాసనసభ సమావేశాల్లో జైళ్లు, సంస్కరణల చట్టం సవరణ బిల్లును అసెంబ్లీలో హోం మంత్రి ఈరోజు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఖైదీల సంస్కరణల కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కేంద్రం తెచ్చిన చట్టం మేరకు ఇక్కడ కూడా సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. ఖైదీల్లో పరివర్తన తీసుకురావటం కోసం చట్టంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళా ఖైదీల పిల్లల కోసం జైలులో ప్రత్యేకంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఖైదీలకు క్షమాభిక్ష విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి అనిత తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

ఆప్కో, చేనేత సంఘాలు విక్రయించిన వస్త్రాలకు జీఎస్టీ మినహాయింపు ఇవ్వాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. ఈ రోజు బడ్జెట్ సమావేశాల సందర్భంగా శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి సమాధనమిస్తూ... నేతన్నల సంక్షేమానికి త్రిఫ్ట్ పథకం, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు నగదు పరపతి పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. త్వరలో చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకం కూడా అమలు చేయబోతున్నట్లు వెల్లడించారు. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లాలోని ధర్మవరంలో 38 కోట్ల 31 లక్షల రూపాయలతో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేయబోతున్నామని తెలియజేశారు.

==========================

అసంఘటిత కార్మికుల సంక్షేమానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. ఈ రోజు శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ... అసంఘటిత కార్మికులకు ఉచిత వైద్య సేవలను అందిస్తున్నామని తెలిపారు. ప్రసూతి సహాయం 20 వేల రూపాయలు, వివాహ కానుక 40 వేల రూపాయలు, సాధారణ మరణం సంభవిస్తే 60 వేల రూపాయలు, తక్షణ అంత్యక్రియల ఖర్చులకు 20 వేల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు మంత్రి వివరించారు. అదే విధంగా 1వ తరగతి నుంచి 12వ తరగతి చదివే నిర్మాణ కార్మికుల పిల్లలకు ఉపకార వేతన పథకం కూడా అమలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. భవన, ఇతర నిర్మాణ కార్మికుల నైపుణ్యాలను పెంపొందించి.. వారి ఉపాధి అవకాశాలను మెరుగు పరచడమే లక్ష్యంగా “కార్మిక సంక్షేమ మండలి” ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తుందని మంత్రి సుభాష్ సభకు వివరించారు.

విరామం

==========================

జాబ్ క్యాలెండర్‌ను ఉగాది పండుగ నాటికి విడుదల చేస్తామని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల్లో ఈ రోజు ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్రంలోని విద్యా వ్యవస్థ, నిరుద్యోగుల సమస్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఉత్తరాంధ్రలో ఏర్పడుతున్న పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఉన్నత విద్యలో ఇంజనీరింగ్‌తో పాటూ పాలిటెక్నిక్, ఐటీఐల ప్రాధాన్యాన్ని సభ్యులకు వివరించారు. విజయనగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మరమ్మతులను “క్లస్టర్ బేస్డ్ అప్రోచ్” ద్వారా వచ్చే ఏడాదిలోగా పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు. ఇతర రాష్ట్రాల కంటే మన రాష్ట్రంలో కస్తూరీ బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) ప్రవేశాలకు తీవ్రమైన పోటీ నెలకొందని, సిబ్బంది జీతాల పెంపుదలపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించామని, కేంద్రం సహకారం అందిస్తే మరిన్ని చర్యలు చేపడతామని మంత్రి లోకేశ్ వివరిస్తూ..

(వాయిస్ 30 సెకన్లు)

==========================

ఏలూరు జిల్లాలోని నిరుద్యోగ యువతకు కంప్యూటర్ హార్డ్ వేర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డిజిటల్ లిటరసి ట్రైనింగ్ సెంటర్ (డి.ఎల్.టి.సి.) సహాయ సంచాలకులు డి. భూషణం ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాశ్ యోజన కింద ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటింగ్, పెరిఫెరల్స్ (కంప్యూటర్ హార్డ్‌వేర్) కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై 15 నుంచి 35 సంవత్సరాల లోపు వారు అర్హులని వెల్లడించారు. ఈనెల 28వ తేదీలోగా డి.ఎల్.టి.సి కార్యాలయానికి దరఖాస్తులు అందించాలని, ఇతర వివరాలకు 94934 82414 నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

==========================

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి మాధవ్ రెడ్డి ప్రజలను కోరారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన 9 వినతులను స్వీకరించారు. వినతులపై విచారణ జరిపి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని వారికి ఎస్పీ హామీ ఇచ్చారు. సమస్యల పరిస్కరానికి సంబంధిత అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.

==========================

ఐసిసి పురుషుల టీ-20 ప్రపంచ కప్ లో భాగంగా సూపర్- 8లో గ్రూప్-1 విభాగంలో ముంబైలోని వాంఖెడే స్టేడియం వేదికగా జింబాంబ్వే, వెస్టిండీస్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరగనుంది. రాత్రి 7 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది.

==========================

నైరుతి, మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాలపై నిన్న ఏర్పడిన అల్పపీడనం అదే ప్రాంతంలో ఈరోజు కూడా కొనసాగుతోంది. దీని ఫలితంగా ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్, రాయలసీమ ప్రాంతాలలో రాబోయే రెండు రోజుల పాటు తేలిక పాటినుండి ఒక మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

==========================

అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వయోజన అభ్యాసకులకు నిర్వహించే పరీక్షలపై ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఈ రోజు సమీక్ష జరిపారు. ఈ నెల 28, 29వ తేదీలలో నిర్వహించే పరీక్షల ఏర్పాట్లపై చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. అభ్యాసకులు నూరు శాతం హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపేలా పరీక్షలు నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

==========================
==========================